క్లుప్తంగా

12 నామినేషన్ల తిరస్కరణ

ఉదయగిరి: వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. 12 నామినేషన్లు తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొత్తం 41 నామినేషన్లు దాఖలు కాగా అందులో వివిధ కారణాలతో 12 నామినేషన్లను తిరస్కరించామన్నారు. జాతీయ జనసేన, యుగతులసీ పార్టీల అభ్యర్థులతో పాటు, పది మంది స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించామన్నారు. ఒక్కో అభ్యర్థి రెండు నుంచి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయడంతో వాటన్నిటిని ఒకటిగా పరిగణలోకి తీసుకోవడం జరిగిందన్నారు. దీంతో 16 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించడం జరిగిందన్నారు.

15 నామినేషన్ల ఆమోదం

కావలి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కావలి నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో పాటు వివిధ పార్టీల అభ్యర్థులు 25 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శీనానాయక్ నామినేషన్ల స్క్రూటినీ చేశారు. ఇందులో 10 నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు ఆర్వో తెలిపారు. 15 నామినేషన్లు ఆమోదించినట్లు పేర్కొన్నారు.

వివాహ వేడుకల్లో మేకపాటి



వధూవరులను ఆశీర్వదిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: జలదంకిలో శుక్రవారం సీనియర్ పాత్రికేయుడు నేలపాటి మాలకొండయ్య కుమారుడి వివాహ వేడుకలకు ఉదయగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు అజయ్ బాబు–ప్రియాంకలను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సురె వెంకటశేషారెడ్డి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పులి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

దుత్తలూరు: దుత్తలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని గ్రామాలకు సంబంధించిన కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్ఎస్సార్ అధ్యాపకులు ముందడుగు

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పీ దిలీప్‌కుమార్, ఏ నందినీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భాగమైన మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్‌లపై ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తక రచన చేయడంతో సహచర అధ్యాపకులు, ఆర్ఎస్సార్ మేనేజ్‌మెంట్ శుక్రవారం ఘనంగా అభినందనలు తెలిపా రు. వేగంగా వృద్ధి చెందుతున్న మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పద్ధతులపై ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడేలా వీరు రచించిన పుస్తకాన్ని సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిక్ హౌస్ ప్రచురించింది. వైద్యారోగ్య రంగంలో, కోవిడ్ వంటి మహమ్మారిలు వ్యాప్తి చెందినప్పుడు, ఇతర ఆధునిక సాంకేతిక అంశాల్లో మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్‌లు ఉపయోగాన్ని వివరించేలా పుస్తకం రచించారు.

గ్రామాల్లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

జలదంకి: గ్రామాల్లో ప్రజా సమస్యలపై అన్ని శాఖల అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ కె. రామచంద్ర చెప్పారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా వైద్య సిబ్బంది గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాసు, వైద్యాధికారి శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

3న మండల సమావేశం

వరికుంటపాడు: మండల సర్వసభ్య సమావేశం మే నెల 3న స్థానిక స్త్రీశక్తి భవనంలో జరుగుతుందని ఎంపీడీఓ టి.వెంకటకృష్ణకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ఫ్యాన్ గిరాగిరా..
సైకిల్ కిర్..కిర్

నామినేషన్ల ఘట్టంతోనే తేలిపోయిన గెలుపోటములు
- టీడీపీకి కలిసిరాని కేడర్.. వర్గాలతో సతమతం
- మేకపాటి జోష్.. కాకర్ల ఉష్..

ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు నామినేషన్ల ఘట్టానికి ముందే డీలా పడ్డాయి. ఆధిపత్యపోరు.. వర్గాల మధ్య అంతరం.. టీడీపీ అభ్యర్థికి ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులతో ఆ పార్టీ భవితవ్యం అర్థమైపోయింది. అసెంబ్లీ బరిలో ప్రధాన ప్రత్యర్థులైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. గత యాభై ఎనిమిది నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమంతో ఆ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతుంటే టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌బాబు సొంత పార్టీలో కుమ్ములాటలు, సహకరించని కేడర్, టీడీపీ, బీజేపీ సహాయ నిరాకరణతో ప్రచారంలో వెనుకబడ్డారు.

ఉదయగిరి: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తయింది. క్షేత్ర స్థాయిలో గెలుపోటములు ఎవరి సొంతం అనేది స్పష్టమైంది. గత ఎన్నికల కంటే భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. గడిచిన యాభై ఎనిమిది నెలల్లో ప్రజలకు అందించిన సంక్షేమం, చేసిన సామాజిక అభివృద్ధే గీటురాయిగా భవిష్యత్ అంజెడాతో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రచారంలో అప్రతిహతంగా దూసుకుపోతున్నారు. అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్లను స్వయంగా కలిసి ఉదయగిరి నియోజకవర్గానికి మేకపాటి కుటుంబం ద్వారా జరిగిన మేలును, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఆయన ప్రచారానికి సైతం ప్రజల నుంచి భారీగా స్పందన లభిస్తోంది. గిరాగిరా తిరుగుతుంది ఫ్యాన్.. అంటూ పార్టీ శ్రేణులే కాక.. ప్రజలు సైతం స్వచ్ఛందంగా మద్దతుగా బయటకు వస్తుండడంతో పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని స్వాగతిస్తూ అనేకమంది వైఎస్సార్‌సీపీలో చేరుతుండటంతో ఆ పార్టీ కేడర్‌లో జోష్ మరింత పెరిగింది. ఈ నెల 24న ఉదయగిరిలో నిర్వహించిన నామినేషన్ పర్వం సూపర్ సక్సెస్ కావడంతో నియోజకవర్గ పార్టీ కేడర్ ఫుల్ జోష్ పెరిగి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయం ఖరారైందని సంబరాలు జరుపుకుంటున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ఉదయగిరి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ముప్పై వేలమంది తరలిరావడం చూస్తే ఆ పార్టీకి ప్రజల్లోవున్న ఆదరణ అర్థమౌతోందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. మరో వైపు ఆయన తనయుడు అభినవ్‌రెడ్డి తండ్రి వెనకుండి పార్టీ నేతల మధ్య సమన్వయం చేసుకుంటూ ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్యులను వైఎస్సార్‌సీపీలో చేర్చుకుంటూ రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించేందుకు బ్యాక్ బోన్‌గా పని చేస్తున్నారు. అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోడళ్లు, ఇతర కుటుంబ సభ్యులు ప్రజల్లో తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.

టీడీపీలో కనిపించని జోష్

ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ ఆదిలోనే డీలా పడిపోయింది. ఆ పార్టీలోని నేతల మధ్య కుమ్ములాటలు, అంతర్గత ఆధిపత్య పోరులో సతమతమవుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్లినా ప్రజల్లో టీడీపీ పట్ల విముఖత చూపుతుండడం, మరికొన్ని చోట్ల కనీసం ప్రజాస్పందన లేకపోవడంతో సైకిల్ కిర్రు..కిర్రు మంటూ ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. టీడీపీ అధిష్టానం సీటు ఎన్‌ఆర్‌ఐ కాకర్ల సురేష్‌బాబుకు ఇవ్వడంతో ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న బొల్లినేని రామారావు తన వర్గంతో దూరమయ్యారు. ఆయనతో పాటు అనుచరులు సురేష్ ఓటమి కోసం తెరవెనుక పని చేస్తున్నారు. ఒక వైపు టీడీపీలో కుమ్ములాటలు, మరో వైపు బొల్లినేని, కాకర్ల వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు, జనసేన, బీజేపీ నేతల మధ్య కుదరని సయోధ్య టీడీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొండాపురంలో టీడీపీ నేతల మధ్య అంతర్గత పోరు తారాస్థాయికి చేరింది. మాజీ జెడ్పీటీసీ దామా మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్, టీడీపీ పార్లమెంట్ అధికారి ప్రతినిధి యారవ కృష్ణయ్య మధ్య వర్గపోరు తీవ్ర స్థాయికి చేరింది. దీంతో పార్టీ ఆఫీసులోనే బాహాబాహీకి దిగారు. దీంతో అసహనానికి గురైన కాకర్ల సురేష్ బొల్లినేని వర్గీయులను చేస్తే పార్టీకి పని చేయండి, లేదంటే వెళ్లిపోండి అంటూ హెచ్చరించారు. దీంతో బొల్లినేని వర్గీయుల నుంచి కాకర్ల సురేష్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆ మండలంలో టీడీపీకి మంచి పట్టు ఉన్నప్పటికీ నేతల మధ్య కుమ్ములాట, కుదరని సయోధ్యతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మంచి మెజార్టీ వస్తుందని టీడీపీ నేతలే చెబుతున్నారు. బొల్లినేని వెంకటరామారావు తెర వెనుక ఉంటూ తనకు అనుకూలమైన ముఖ్య నేతలతో నిత్యం ఫోన్ టచ్‌లో ఉంటూ అభ్యర్థి సురేష్ బలహీనతలు తెలుసుకుంటూ అతనిని దెబ్బ తీసేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో ఉదయగిరిలో సురేష్ గెలవకూడదనే అజెండాతో బొల్లినేని, అతని వర్గీయులు తెరవెనుక పనిచేస్తున్నారు. పార్టీలో బొల్లినేని కోవర్టులు ఎక్కువవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో సురేష్, అతని అనుచరులు సతమతమవుతున్నారు. ఒక వైపు వైఎస్సార్‌సీపీ తొలిఘట్టం నామినేషన్ పర్వం సూపర్ సక్సెస్ కావడం, మరో వైపు సొంత పార్టీలోని అసమ్మతి నేతల బెడద, అంతర్గత పోరు టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.



వైఎస్సార్‌సీపీని గెలిపించండి

- మేకపాటి కుమారుడు, కోడలు ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అభిషేక్‌రెడ్డి, శ్రీయారెడ్డి

జలదంకి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కొడుకు, అభిషేక్‌రెడ్డి, కోడలు శ్రీయారెడ్డి జలదంకిలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి జేసీఎస్ కన్వీనరు తిప్పారెడ్డి ఇందిరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, సూరె వెంకటశేషారెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, వాకా మాధవరెడ్డి, సయ్యద్ ఖాజారంతుల్లా, ఒంగోలు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం సాధ్యం

- దళిత, గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కలివేల



మాట్లాడుతున్న ఎలీషాకుమార్

ఉదయగిరి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని కులాల్లోనూ పేదరికమే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందిచడం సాధ్యమని దళిత, గిరిజన ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐక్య క్రైస్తవ సంఘాల కన్వీనర్ కలివేల ఎలీషాకుమార్ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు రాజకీయ పార్టీల గెలుపు ఓటములకు ఉపయోగపడతాయన్నారు. కానీ పేదరికం రూపుమాపాలంటే అది ఒక్క వైఎస్సార్‌సీపీకే సాధ్యమన్నారు. దేశంలో ఎన్నో కులాలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలతో కలిసిమెలిసి జీవిస్తున్న సమాజంలో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని బీజేపీ, మిత్రపక్షాలైన టీడీపీ, జనసేనలు ప్రయత్నిస్తున్నాయన్నారు. చంద్రబాబు పాలన కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులకు కొమ్ము కాసేలా పని చేసిందన్నారు. ప్రస్తుత జగనన్న పాలన ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో విద్యాపరంగా ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యాప్రమాణాలు ఎంతగానో పెరిగాయన్నారు. ఉదయగిరి ప్రాంతంలో మేకపాటి కుటుంబం 40 ఏళ్లుగా ఎంతో అభివృద్ధి పనులు చేసిందన్నారు. విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి మేకపాటి కుటుంబానికే సాధ్యమవుతోందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పే నాయకులకు తగిన బుద్ధి చెప్పి, ప్రజాసంక్షేమ ప్రభుత్వమైన వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకురాలు సురేఖ బేబి, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు ఎల్.అశోక్‌కుమార్, ఎంపీటీసీలు తిరుపతి, సుభాన్, మాజీ సర్పంచ్ అక్కుల్‌రెడ్డి, నాయకులు పెంచలయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కృష్ణకుమారి



చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్బారావు

కావలి: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘం తాలూకా కార్యాలయం బయట ట్రంకురోడ్డు పక్కన మంచినీటి చలివేంద్రంను డాక్టర్ కామంచి సుబ్బారావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకుల రమణయ్యతో పాటు అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి సాయిరాం సింగ్, ట్రెజరర్ ఏపూరి వెంకయ్య, కార్యవర్గ సభ్యులు ఆదిశేషులు కృష్ణారావు, సాబ్జాన్, మన్నేపల్లి వెంకటేశ్వర్లు, అత్తోటి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారి తన సొంత నిధులతో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కార్యాలయానికి వచ్చే కార్యార్థులు, సిబ్బంది దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రయంలో అన్నదానం



అల్లూరు: మండలంలోని నార్త్ ఆములూరులో ఉన్న అనాథ చైల్డ్ ఆశ్రమంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోదరుడు ఆదాల మురళీకృష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా మూడు పూటల అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఆశ్రమ నిర్వాహకుడు శరత్, స్థానిక సర్పంచ్ షేక్ కరిముల్లా, పఠాన్ అబ్దుల్, వెంకటేశ్వర్లు, శివయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం అల్లిమడుగు సంఘానికి తూర్పున వ్యవసాయ భూముల్లో ఉన్న నేల బావిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల లోపు వ్యక్తి నేలబావిలో మృతి చెంది ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీయించి వివరాలు పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై 'వెంకీ సరోజిని' అనే పచ్చబొట్టు, భుజంపైన మరో పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. ఈమేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని బిట్రగుంట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీహెచ్‌సీలో క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం



శస్త్ర చికిత్స చేయించుకున్న రోగితో వైద్యులు

ఉదయగిరి: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆర్థో విభాగానికి సంబంధించి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు ఆ విభాగ వైద్యుడు శివరాం సిద్దా తెలిపారు. ఆయన శుక్రవారం వైద్యశాలలో డీడీఓ డాక్టర్ అనీషాతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ వైద్యశాలలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న యనమల రత్నమ్మకు ఒకటిన్నర నెల క్రితం పాదం గిరక భాగం వద్ద నరం తెగిందన్నారు. వెంటనే శస్త్ర చికిత్స చేసి ఉంటే సులభం అయ్యేదన్నారు. రోజులు గడవడంతో నరం పైకి వెళ్లిందన్నారు. కష్టం మీద నరాన్ని క్రిందకు తీసుకొచ్చి ఎముకకు అతికించి మేజర్ శస్త్ర చికిత్స పూర్తి చేశామన్నారు. ఉదయగిరి వైద్యశాలలో ఇంత వరకు ఇలాంటి శస్త్రచికిత్స చేయలేదన్నారు. వైద్యులు అనీషా, షంషుద్దీన్ చికిత్సకు సహకరించారన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్థో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీడీపీ నుంచి కొనసాగుతున్న వలసలు



వైఎస్సార్‌సీపీలో చేరిన తాళ్లపాలెంకు చెందిన టీడీపీ వర్గీయులు



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు పెరిగాయి. పట్టణంలో అయితే వార్డులకు వార్డులే ఖాళీ అవుతున్నాయి. పల్లెల్లో అయితే ఆ పార్టీ క్రియాశీలక నేతలు, కార్యకర్తలతో పాటు అభిమానులు సైతం టీడీపీకి గుడ్‌బై కొట్టి వైఎస్సార్‌సీపీకి జైకొడుతున్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలందరూ తిరిగి ఆ పార్టీకే పట్టం కట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తుంది.. ప్రతిపక్షం ఉనికి ఉండే అవకాశం లేదని, ఈ తరుణంలో ఆ పార్టీలో ఉండి అవమానంగా తిరిగే బదులు అధికార పార్టీ వర్గంగా, గ్రామంలో ఐక్యంగా ఉండొచ్చనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

మాతినవారిపాళెం నుంచి 30 కుటుంబాలు

కావలి మండలం సర్వాయపాళెం పంచాయతీ మాతినవారిపాళెంలో టీడీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. టీడీపీని వీడి 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మోర్ల రమణయ్య, జంపాని సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన కేతిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఉప్పాల ప్రభాకర్, మోర్ల బాలరాజు, ఉప్పాల రాజేష్, పలువురు కార్యకర్తలు టీడీపీకి గుడ్‌బై చెప్పారు.

తాళ్లపాళెం టీడీపీ వర్గీయులు చేరిక..

అల్లూరు: కావలి మండలం తాళ్లపాళెం గ్రామానికి చెందిన 50 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అల్లూరు మండలం సింగపేటలో ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో అక్కడికి చేరుకుని పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు అసెంబ్లీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, అల్లూరు పట్టణ కన్వీనర్ దండా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3వ వార్డులో టీడీపీ ఖాళీ

కావలి: టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వైఖరితో ఆ పార్టీకి శ్రేణులు గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. శుక్రవారం పట్టణంలోని 3వ వార్డుకు చెందిన టీడీపీ నేతలు సయ్యద్ కాలీషా, షేక్ గయాజ్, షేక్ తజుముల్, షేక్ రబ్బానీతో పాటు 50 కార్యకర్తలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారందరికీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మండలి కృష్ణారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యేగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిలను భారీ మెజారీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ నాయబ్ రసూల్, షఫీ, శివరామిరెడ్డి, షాలి, ముస్తాక్, పద్మనాభరెడ్డి, బాబు బాయ్ (ట్రాక్టర్), రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో టీడీపీకి గట్టి షాక్



మాసాయిపేటలో పార్టీలో చేరిన వారితో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి.



సినిమా హాలు సెంటర్‌లో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అభినవ్‌రెడ్డి

- పలువురు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ఉదయగిరి: మండలంలో టీడీపీకి ప్రజాదరణ తగ్గిపోతోంది. ఫలితంగా పలు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడమే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. తాజాగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మాసాయిపేటలో వైఎస్సార్‌సీపీ నేత ఎం.వెంకటమ్మ కుమారులు హరిబాబు, జయకృష్ణ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయగిరి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆయన తనయుడు అభినవ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారి సమక్షంలో గ్రామానికి చెందిన 40 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి మేకపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని మేకపాటి హామీ ఇచ్చారు.

సినిమా హాలు సెంటరులో 50 కుటుంబాలు

ఉదయగిరి సినిమా హాలు సెంటరులో వైఎస్సార్‌సీపీ నేత టింకరింగ్ బాబు నేతృత్వంలో వార్డు మెంబర్ అలి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు, టీడీపీకి చెందిన 50 కుటుంబాలు అభినయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ నేతృత్వంలో పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లెలో మేకపాటి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామాంజనేయులు, మాజీ ఎంపీపీ సీహెచ్ సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ జి.వెంకటరమణమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఎం.వినయ్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కె.రమణారెడ్డి, ఎంపీటీసీ జి.తిరుపతి, నాయకులు జి.శ్రీనివాసులురెడ్డి, హరి, ముర్తుజా హుస్సేన్ ఎస్దానీ, ఏ భాస్కరరెడ్డి, సలీం, సుభానీ, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా మోటార్‌బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో అభివాదం చేస్తున్న అభినవ్‌రెడ్డి

కలిగిరి: కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెం తిప్ప అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి కలిగిరి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి కుమారులు మేకపాటి అభినవ్‌రెడ్డి, మేకపాటి అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ మోటార్‌బైక్ ర్యాలీ జరిగింది. అభయాంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మోటార్‌బైక్‌లతో యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. యువనేతలు మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చనేతల 'రెడ్‌బుక్' రంకెలు

కావలి: కావలిలో టీడీపీకి ఘోర ఓటమి తప్పదని స్పష్టమవడంతో ఆ పార్టీ నేతల్లో ఫ్రస్ట్రేషన్ తారాస్థాయికి చేరింది. లోకేశ్ దగ్గరే కాదు.. మా దగ్గరా రెడ్‌బుక్ ఉందని, ఎన్నికల తర్వాత అధికారులు, ఓటర్ల సంగతి తేలుస్తామంటూ పచ్చనేతలు పిచ్చిపిచ్చిగా రంకెలు వేస్తున్నారు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, టికెట్ ఆశించి భంగపడిన మాలేపాటి సుబ్బానాయుడు ఎన్నికల ప్రచారంలో ఈ విధమైన వార్నింగ్‌ల వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పుడే వీళ్ల బరితెగింపు ఇలా ఉంటే.. పొరపాటున గెలిపిస్తే పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ప్రజలతో పాటు అధికారుల వ్యవస్థ కూడా రగిలిపోతున్నారు. అక్రమ క్వారీలతో అడ్డంగా దోచేసిన బలుపుతో రౌడీ రాజకీయాలు చేస్తున్న కావ్య కృష్ణారెడ్డి, ఎయిర్‌పోర్టు, ఏపీఐఐసీ భూముల్లో పేదల ఉసురుపోసుకున్న మాలేపాటి సుబ్బానాయుడు వీధిరౌడీల్లా అందరి సంగతి తేలుస్తామని బెదిరించడం కావలిలో కలకలం రేపింది. పోలింగ్ దగ్గరపడే కొద్ది ఇంకెన్ని అల్లర్లు సృష్టిస్తారోననే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

నేడు బీసీల ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు: నియోజకవర్గ స్థాయి బీసీల ఆత్మీయ సమావేశం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మరో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి బీసీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న భక్తులు

అనుమసముద్రంపేట: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో 13 అడుగుల ఏక శిలా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అభయాంజనేయస్వామికి అభిషేకాలు, హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఓటు హక్కుపై అవగాహన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు: మండలంలోని చిన్నమాచనూరు గ్రామంలో ఓటు హక్కు వినియోగం, ఓటింగ్ సరళిపై ఎస్సై విశ్వనాథరెడ్డి శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు లొంగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలని తెలిపారు.

13 నామినేషన్లు ఓకే

ఆత్మకూరు: ఆత్మకూరు శాసనసభ స్థానానికి పోటీ చేసేందుకు నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియడంతో శుక్రవారం ఆర్‌ఓ, ఆర్డీఓ కె.మధులత ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలు స్క్రూట్నీ చేశారు. మొత్తం 15 మంది అభ్యర్థులకు డమ్మీలు, అదనపు సెట్ నామినేషన్లు కలిపి 27 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. వాటిలో చెరుకూరు రంతు అనే ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ సాంకేతిక కారణాలతో రిజెక్ట్ అయిందన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి తరపున డమ్మీ నామినేషన్ వేసిన ఆయన సోదరుడు మేకపాటి పృథ్వీకుమార్‌రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో మొత్తం 13 మంది అభ్యర్థులు ప్రస్తుతానికి బరిలో నిలిచినట్లైంది. నామినేషన్ల ఉపసంహరణకు 29 వరకు గడువు ఉండడంతో ఎంతమంది బరిలో నిలవనున్నారో మరో రెండు రోజుల్లో తెలియనుంది.

అటవీ ప్రాంతానికి ఆకతాయిల నిప్పు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లి సమీపంలో ఆకతాయిలు అటవీ ప్రాంతానికి నిప్పు పెట్టడంతో దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మహిళకు ఆర్థికసాయం



మర్రిపాడు: మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన కుంభగిరి పోలమ్మ ప్రమాదవశాత్తు జారి పడి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న మర్రిపాడు జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

- వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి


ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

అనుమసముద్రంపేట: గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరు, తెల్లపాడు, అనుమసముద్రం, వేల్పులగుంట, కావలియడవల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు విచ్చేసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. గజమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. గతంలో జరిగిన ఐఏబీ సమావేశంలో ఆత్మకూరు నియోజకవర్గ రైతాంగం కోసం తాను 6 టీఎంసీల నీరు కేటాయించాలని కోరానని, అనంతరం ముఖ్యమంత్రిని కలిసి ఈ విషయాన్ని విజ్ఞప్తి చేయగా ఆయన నీటి విడుదలకు సహకరించారని, తద్వారా నియోజకవర్గంలో 90 శాతానికి పైగా రైతుల పొలాలకు సాగునీరు అందించి పంటలు సుభిక్షంగా పండించుకునేలా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. అదే సమావేశంలో రైతుల కోసం ఒక్క మాట కూడా మాట్లాడని ఆనం రామనారాయణరెడ్డి ఇప్పుడు టీడీపీ ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకువచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్నారని, ఆయనకు ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే ప్రజలు మళ్లీ ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మురళీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

టీడీపీకి ఓటమి తథ్యం

- వైఎస్సార్‌సీపీకి ఉన్న ప్రజాదరణ చూసి బెంబేలెత్తుతున్న టీడీపీ శ్రేణులు
- ప్రలోభాలపైనే గురి

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటమి తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మూడు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసే క్రమంలో పట్టణమంతా కిక్కిరిసిన స్థాయిలో హాజరైన ప్రజలను చూసి టీడీపీ నాయకులు బెంబేలెత్తారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణ చూసి టీడీపీ శ్రేణులు నిరుత్సాహానికి గురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

మహిళలను, రైతులను మోసం చేసిన బాబు

గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు రద్దు చేస్తానని ఆర్భాటంగా ప్రకటించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అనంతరం ఆ పథకాలకు నిధులు కేటాయించకుండా అరాకొరా నగదు విదిల్చి వాటిని అటకెక్కించిన విషయం ప్రజలు మరువలేకున్నారు. ప్రస్తుతం రైతులను ఆదుకుంటా, మహిళలను లక్షాధికారులను చేస్తానని చంద్రబాబు ప్రచారం నిర్వహిస్తుంటే ఆ వర్గాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే ఆయన చేసిన మోసంతో ఐదేళ్లపాటు అప్పులపాలై వడ్డీలు కట్టలేక ఇళ్లు, స్థలాలు అమ్ముకున్నామని, బ్యాంకుల్లో నగలు సైతం వదులుకున్నామని వారు ఆ మోసాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. ఇలా అన్నివర్గాల ప్రజలు చంద్రబాబు చేసిన మోసాలపై మండిపడుతున్నారు.

ప్రలోభాలకు టీడీపీ ప్రాధాన్యం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నాయకులు ప్రలోభాల పర్వానికి తెరలేపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా నాయకులను ప్రలోభాలకు గురిచేసి తమ వైపుకు తిప్పుకుంటున్నారు. కాగా ఇలాంటి జంప్ జిలానీలకు సొంత గ్రామాల్లో, వార్డుల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

వైఎస్సార్‌సీపీకి అండగా ప్రజలు

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో, గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి, అలాగే నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రజలు అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలను పొందిన ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తున్నారు. కాగా తమ ఇంటి వద్దకే పింఛన్లు అందజేయడాన్ని అడ్డుకున్న చంద్రబాబుపై పలువురు వృద్ధులు, దివ్యాంగులు మండిపడుతున్నారు. పింఛన్ కోసం తాము మళ్లీ రోడ్డెక్కేలా చంద్రబాబు కుట్రలు చేశారని ఈసడించుకుంటున్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లుగా వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించడం ఆ పార్టీకి కలిసి వచ్చే అంశం. దీంతో టీడీపీకి ఓటమి తప్పదని ప్రజలు బాహాటంగా చెబుతున్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలంటూ పూజలు


పూజలు నిర్వహిస్తున్న రాపూరు వెంకటసుబ్బారెడ్డి

సోమశిల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ అనంతసాగరం మండలం సోమశిలలోని శ్రీకామాక్షితాయి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో, శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాపూరు మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని మండల ప్రజల తరపున ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట భక్తవత్సలరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పతివ్రతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో పతివ్రతమ్మతల్లి మూలమూర్తి


బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో శుక్రవారం పతివ్రతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి గణపతి పూజ, హోమాలు, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సాయంత్రం మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల సామగ్రితో అమ్మవారి ఆలయ ప్రాంగణానికి చేరుకొని పాలపొంగళ్లు పొంగించి పతివ్రతమ్మతల్లికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


అనుమసముద్రంపేట: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


ఆత్మకూరురూరల్: ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పడకండ్ల టీడీపీ నాయకులు

అనుమసముద్రంపేట: గత 25 ఏళ్లుగా టీడీపీలో కొనసాగిన ఆ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ సంధాని తమ అనుచరులు 300 మందితో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అనుమసముద్రంలోని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి నివాసంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంధాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మేకపాటి విక్రమ్‌రెడ్డి వెంటే తాము నడుస్తామని తెలిపారు.

పడకండ్ల నేతల చేరిక

ఆత్మకూరురూరల్: మండలంలోని పడకండ్లకు చెందిన కొరమ చెంచురామయ్య ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో గురువారం రాత్రి చేజర్ల మండలం బోడిపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, దాడి శ్రీనివాసులు నాయుడు, పెమ్మసాని గజేంద్రనాయుడు, నరమాల వేణు, మల్లికార్జున, కామేపల్లి శ్రీకాంత్, వరదా వెంగయ్య, తలారి పోలు, తలారి బాబు, కుంభగిరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


చేజర్ల: రమేష్‌ను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న వంశీకృష్ణారెడ్డి

టీడీపీ కార్యకర్త చేరిక

చేజర్ల: చేజర్ల అరుంధతీయవాడకు చెందిన టీడీపీ కార్యకర్త దొంతాల రమేష్ శుక్రవారం చేజర్లలోని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ యువనాయకుడు తూమాటి వంశీకృష్ణారెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లను పెంచాలి


మాట్లాడుతున్న డీఈఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సిబ్బంది డీ లిస్టులపై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ వసూళ్లను పెంచాలని నెల్లూరు టౌన్–2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నూతన ఏర్పాటు చేసిన విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున విద్యుత్ సిబ్బందితో పాటు అవుట్ సోర్సింగ్, షిఫ్ట్ ఆపరేటర్లు రాజకీయ సమావేశాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ ఫలాలు


ఆత్మకూరురూరల్: మురగళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సోమశిల: ముత్తుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


సంగం: తలుపూరుపాడు గ్రామంలో..


చేజర్ల: పాదేరు గ్రామంలో..

ఆత్మకూరురూరల్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు మండలంలోని మురగళ్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ ఫలాలు అందుకున్న పేదలు, మహిళలు, అవ్వాతాతలు, రైతులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన రానున్న ఐదేళ్లలో కూడా కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పువ్వాడి హరిత, మాలేపాటి సతీష్‌నాయుడు, బొలిగర్ల వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, నాయకులు రమేష్‌నాయుడు, పువ్వాడి శ్రీనివాసులు, తోడేటి అశోక్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఎర్రగుంట పెంచలయ్య, మహిళా నాయకులు భాగ్యమ్మ, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం ఆధ్వర్యంలో..

సోమశిల: అనంతసాగరం మండలంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బట్రెడ్డి నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముత్తుకూరు, గార్లదిన్నెపాడు గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో నాగేంద్ర, వినోద్, శ్రీనివాసులు, సుజీత్, రాపూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాగరంలో..

అనంతసాగరంలోని చిన్నగుండం, నడివీధి, కుమ్మరవీధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, సద్దా రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, కోఆప్షన్ సభ్యుడు కరిమొద్దీన్, వడ్లపల్లి శ్రీను, షేక్ ఖాజామొహిద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపూరుపాడు గ్రామంలో..

సంగం: మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని కోరారు. నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరిముల్లా, మాల్యాద్రి, శీనయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాదేరు గ్రామంలో..

చేజర్ల: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి మహమ్మద్ రఫి కోరారు. శుక్రవారం చేజర్ల మండలం పాదేరు గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాకుమూరు వెంకటరెడ్డి, ప్రవీణ్, శ్రీను, వివేక్, వంశీ, పవన్, యువత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ప్రజాసత్తా అధ్యక్షుడు



చేజర్ల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేజర్ల మండలం బోడిపాడు గ్రామంలోని కొండారెడ్డి నివాసంలో ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు.

మనస్తాపంతో ప్రచారం వీడిన జనసేన నాయకులు

సోమశిల: అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం టీడీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రచారంలో పాల్గొన్న జనసైనికులు ఓ నాయకుడి తీరుతో మనస్తాపం చెంది అర్ధాంతరంగా వెనుదిరిగారు. చిలకలమర్రి సుబ్బరాజు నివాసంలో ఆనం మండల నాయకులతో సమావేశమయ్యారు. ఓ టీడీపీ నాయకుడు ఆనంతో ముఖాముఖి మాట్లాడిస్తానని జనసేన నాయకులకు తెలుపగా వారు గంటల కొద్దీ నిరీక్షించారు. చివరికి ఆనంతో మాట్లాడించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ జనసైనికులు ప్రచారంలో పాల్గొనకుండా వెనుదిరిగారు.

వైద్యం వికటించి బాలింత మృతి

ఆత్మకూరు: అనంతసాగరం మండలం రేవూరుకు చెందిన గర్భిణి భవాని (25) గురువారం రాత్రి కాన్పు కోసం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో చేరారు. అక్కడ శుక్రవారం తెల్లవారుజామున ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చారు. కాన్పు అనంతర వైద్యసేవల్లో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో బాలింత భవాని మృతిచెందారు. ఈ ఘటనకు గల కారణాలపై వైద్యశాల డాక్టర్లు విచారణ చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

కావలి: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘం తాలూకా కార్యాలయం బయట ట్రంకురోడ్డు పక్కన మంచినీటి చలివేంద్రంను డాక్టర్ కామంచి సుబ్బారావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకుల రమణయ్యతో పాటు అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి సాయిరాం సింగ్, ట్రెజరర్ ఏపూరి వెంకయ్య, కార్యవర్గ సభ్యులు ఆదిశేషులు కృష్ణారావు, సాబ్జాన్ పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్బారావు

సీతారాములకు పార్వేట ఉత్సవం

పొదలకూరు : పట్టణంలోని శ్రీరామమందిరం వద్ద నవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. తుమ్మల పెంచలయ్య–కొండలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం 12 గంటలకు సహస్ర నామార్చన, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. పార్వేట మహోత్సవం తర్వాత సీతారాముల గ్రామోత్సవం జరిగింది. మహిళా భక్తులు కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన పండరి భజన భక్తులను ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో తుమ్మల శ్రీనివాసులు, రమణయ్య, ప్రసాద్, శ్రీహరి, వెంకటకిశోర్, నరేంద్ర, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.


సీతారాముల గ్రామోత్సవం